




# కొంటె ప్రశ్నలడిగేవారిపై పన్నీరు 'ఫన్'నీరు

పురుషులందు పుణ్య పురుషులువేరయా అని ఎందుకన్నాడు వేమన? అన్నా, స్త్రీల గురించేమీ చెప్పలేదే?

*అయ్యో 'పాపం' ఏమి చెప్పగలడు?*

మీకు లాటరీలో కోటి రూపాయలు తగిలితే ఏం చేస్తారు?

*గుండె జబ్బు రాకుండా జాగ్రత్త పడతా..*

దేవుళ్ళందరికీ ఇద్దరు ఇద్దరు భార్యలుండగా, మనకెందుకు బహుభార్యాత్వం నేరం?

*వాళ్ళు చచ్చి అమరులయ్యారు, మనకా ఖర్మ ఎందుకులే అని..!*

వోటు విలువ తెలుసుకో అంటుంటారు ఎంతుంటుందేమిటి?

*'బూత్' లను బట్టి మారుతుంది..*

రాజుగారి ఏడుగురు కొడుకులు వేటకి వెళ్ళి 'చేపలు' పట్టుకురావడమేమిటి? అసంబద్ధంగా లేదూ?

*వాళ్ళకి ఎ.సి.బి(యాంటీ కరప్షన్ బ్యూరో) ట్రైనింగ్ ఇచ్చి ఉంటారు..*

జూదం తప్పని తెలిసినా పాండవులు ఎందుకాడారంటారూ?

*అప్పట్లో అది 'లా'టరీ కాబట్టి..!*

రాజకీయాల్లో పైకి రావాలంటే ఎంచేయాలి?

*కిందకు దిగజారాలి..*

హైస్కూల్లో హాస్యాన్ని ఒక సబ్జెక్టుగా చేర్చి, మిమ్మల్ని విద్యాశాఖా మంత్రిని చేస్తే ముందుగా మీరేం చేస్తారు?

*ఆ సబ్జెక్టులో మంచి మార్కులు వచ్చిన వాళ్ళకి 'తెనాలిరామలింగ మెమోరియల్ అవార్డులు' ప్రవేశపెడతాను..!*

అదేదో దేశంలో ప్రభుత్వాఫీసుల్లో మధ్యాహ్నం భోజనం అయ్యాక ఒక అరగంట సేపు నిద్రపోవడానికి అనుమతిస్తారట..మన రాష్ట్రంలో కూడా ఈ విధానం అమలు చేస్తే ప్రభుత్వ కార్యాలయాల్లో చురుకుదనం పెరుగుతుందేమో..ఏమంటారు?

*ఆఫీసులో కొంతసేపు నిద్రపోతే అనారోగ్యం పోతుంది. ఎక్కువసేపు నిద్రపోతే ఉద్యోగం పోతుంది. ఏదైనా ఒంటికి మంచిదే ఐనా ఇంటికి మాత్రం చేటే..*

వానాకాలం నీటిని ఎండాకాలానికి పొదుపుచేస్తే హైదరాబాదు నీటి ఎద్దడి కాస్త తగ్గుతుందేమో?

*ఎప్పుడు ఏమి చేసినా నీళ్ళు తాగించడంలో మనవాళ్ళు ఘనులే కదా..!*

ఈ మధ్యన సినిమా తారలు వస్త్ర దుకాణాల ప్రారంభోత్సవాలకి విరివిగా వెళుతున్నారు. ఐనా పాపం..సినిమాల్లో మాత్రం వాళ్ళు ఆ దుస్తులు ధరించరు..ఎనీ కామెంట్?

*తమకి లేని అదృష్టం మీకైనా ఉండాలని అలా ప్రోత్సహిస్తున్నారు..ఎంత త్యాగ బుద్ధో కదా..!*

టి.వి.సెట్ల పై పన్ను వెయ్యాలని ప్రసారభారతి ఆలోచిస్తోందట.. వాళ్ళ ఆదాయం పెరగడానికి ఇంకేమైనా చిట్కాలు చెబుతారా?

*ఒక్కో సీరియల్ కీ ఒక్కో ప్రేక్షకుడికీ(ప్రేక్షకురాలికీ) ఇంత పన్ను అని వేస్తే సరి..!*

దేవదాసు, పార్వతి ఈ కాలంలో పుట్టి వుంటే వాళ్ళ ప్రేమకథ ఎలా సాగి ఉండేది..?

*అంతకాలం 'సాగ'డం ఉండేది కాదు. 'మెయిల్' వరకూ వెళ్ళకుండా ఇ-మెయిల్లో నే అటో ఇటో తేలిపోయేది..*

చిలిపి ప్రశ్నలకి హాస్యబ్రహ్మ, హాస్యావధాని శంకరనారాయణగారి నుంచీ కొంటె సమాధానాలు తెలుసుకోవాలని ఉందా!? ఇంకా ఆలశ్యమెందుకు.. మీ చిలిపి ప్రశ్నల్ని **editor@koumudi.net** కి వెంటనే పంపించండి..!!